క్లుప్తంగా

శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



దాత శ్రీకర్‌కు విరాళం బాండ్ పత్రం అందజేత

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి ఒక భక్తుడు ఆదివారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఏలూరుకు చెందిన సుంకర శ్రీకర్ ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యన్నారాయణ మూర్తి విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

రాజబాబుకు వైఎస్సార్ సీపీ నేతల నివాళులు



రాజబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పిస్తున్న భీమేశ్వరరావు, తదితరులు

ద్వారకాతిరుమల: వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబుకు గోపాలపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ మేధావుల ఫోరం విభాగ అధ్యక్షుడు పాకలపాటి త్యాగభీమేశ్వరరావు ఆదివారం నివాళులర్పించారు. ముందుగా ఆయన సీహెచ్ పోతేపల్లిలోని రాజబాబు ఇంటికి వెళ్లి, ఆయన కుమారుడు సంజయ్‌ను, కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం రాజబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ పోతేపల్లి, మద్దులగూడెం గ్రామ సర్పంచ్‌లు పోల్కంపల్లి అనీల్, చెలికాని ప్రవీణ్, పల్లాలు, వినయ్‌కుమార్, భాస్కరరావు తదితరులున్నారు.

కోడిపందేలపై దాడి

టి.నరసాపురం: కోడిపందాల స్థావరంపై టి.నరసాపురం పోలీసులు దాడులు నిర్వహించారు. కృష్ణాపురం గ్రామ శివారులో కోడిపందాలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు దాడి చేసి ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై జయబాబు తెలిపారు. వీరి నుంచి రూ.13 వేలు నగదు, ఒక కోడిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. దాడిలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గురుకులంలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ద్వారకాతిరుమల: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్లు భర్తీకి విద్యార్థినుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ బెజవాడ రాణి తెలిపారు. 5వ తరగతి 80 సీట్లు, జూనియర్ ఇంటర్ బైపీసీ 40 సీట్లు, ఎంపీసీ 40 సీట్లు భర్తీ చేస్తామన్నారు. అర్హులైన విద్యార్థినులు హెచ్‌టీటీపీఎస్://ఏపీబీఆర్‌ఏజీసీఈటీ.ఏపీసీఎఫ్‌ఎస్‌ఎస్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మార్చి 6 వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని చెప్పారు.

'ఆ వార్తల్లో వాస్తవం లేదు'

కుక్కునూరు: చిరవెల్లి గ్రామంలో పోలవరం ఆర్ అండ్‌ఆర్ ప్యాకేజీకి సంబంధించి జరిగిన సెటిల్‌మెంట్‌లో జిల్లా అధికారికి, మండల నాయకులకు సంబంధంలేదని చిరవెల్లి గ్రామానికి చెందిన నిర్వాసితుడు ముత్తంశెట్టి ప్రసాద్ తెలిపారు. ఆర్‌అండ్‌ఆర్ పరిహారం సెటిల్‌మెంట్ విషయమై పత్రికల్లో వచ్చిన కథనాలపై ఆదివారం ముత్తంశెట్టి ప్రసాద్ తాను మాట్లాడిన వీడియోను గ్రూపుల్లో పోస్ట్ చేశాడు. ఈ సందర్భంగా చిరవెల్లిలో తాను ఉంటున్న రేకుల షెడ్డు నిర్మాణం గతంలో స్కూల్ అని, అదీ ఇద్దరు పార్ట్‌నర్లతో కలిసి గతంలో ఏర్పాటు చేసినట్టు చెప్పాడు. ఇటీవల సదరు షెడ్డు నిర్మాణానికి పరిహారం తన పేరున జమకాగా ఆవిషయంలో తనకు, పార్ట్‌నర్లకు డబ్బులు పంచుకునే విషయంలో వచ్చిన బేదాభిప్రాయాలను పెద్దమనుషుల చొరవతో రాజీచేసుకున్నట్టు ప్రసాద్ చెప్పాడు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

జంగారెడ్డిగూడెం: చికిత్స పొందుతూ యువకుడు మృతిచెందినట్లు హెచ్‌సీ జె.మోషే తెలిపారు. జంగారెడ్డిగూడెంకు చెందిన చెల్లూరి శ్రీనివాస్ టైలరింగ్ వృత్తి చేస్తూ జీవిస్తున్నాడు. 10వ తేదీ రాత్రి పాలు తీసుకువచ్చేందుకు స్కూటీపై వెళుతుండగా స్థానిక బైపాస్ రోడ్ ఇండియన్ పెట్రోల్ బంక్ సమీపానికి వచ్చేసరికి రోడ్డుపై ఉన్న గొయ్యిలో పడిపోవడంతో తలకు తీవ్ర గాయమైంది. వెంటనే స్థానికులు క్షతగాత్రుడిని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం 11వ తేదీ విజయవాడ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీనివాస్ శనివారం రాత్రి మృతి చెందాడు. శ్రీనివాస్ తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

కామవరపుకోట: గ్రామ పంచాయతీలు సాలీడ్ వేస్ట్ మేనేజ్మెంట్ షెడ్‌లను వినియోగించుకుంటూ తడి, పొడి చెత్త ద్వారా సంపద సృష్టించుకోవాలని ఎంపీడీవో ముళ్లగిరి సరళ కుమారి అన్నారు. ఆదివారం కళ్లచెరువు, సాగిపాడు పంచాయతీలలో ఆయన పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. గ్రామస్తులకు తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు.

మన్యంలో ఇలవేల్పు జాతరకు సన్నాహాలు

- పశ్చిమ మన్యంలో సోదెం వారి ఇంటి పేరుతో ఇలవేల్పు జాతర
- జాతరకు ఏర్పాట్లు చేస్తున్న సోదెం, రవ్వ ఇంటి పేరు గల గిరిజనులు

బుట్టాయగూడెం: ఆదివాసీ సమాజంలో ఇలవేల్పుల జాతర అత్యంత ప్రాముఖ్యమైనది. ప్రతి మూడేళ్లకు మాఘ పున్నమి తర్వాత వచ్చే నెలలో తమ కుల దేవతలకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకుంటారు. ఇది గిరిజనులు ఆచారం. ఆదివాసీ తెగలోని వంశం వారి ఇంటి పేరుని బట్టి కుల దేవతలు ఉంటారు. కోయ తెగ వారి వంశాన్ని బట్టి గోత్రాలుగా పిలుస్తారు. ఈ గోత్రాల్లో 6వ గట్టు గోత్రంకు చెందిన వారు పెరంబోయిన రాజు వంశానికి చెందిన వారు. ఈ వంశానికి చెందిన ఇంటి పేర్లు సోదెం, రవ్వ. ఈ ఇంటి పేరు ఉన్న వారు ఇలవేల్పు పెద్ద ఆడమ రాజు, చిన ఆడమరాజు. వీరు ప్రతి మూడేళ్లకు జాతరను ఎంతో సంప్రదాయ పద్ధతిలో వైభవంగా నిర్వహిస్తారు.

కోయలు రాయిని, చెట్టు, పుట్టను దేవుళ్లుగా కొలుస్తారు

కోయలు విగ్రహారాధన చేయరు. చెట్టు, పుట్ట, రాయిని దేవుళ్లుగా కొలుచుకుంటూ పూజలు చేస్తారు. వారు పూజించే రాయికి ఆకారం ఉండదు. ప్రతి గ్రామంలో ఇలవేల్పుల దేవతలు ఉంటారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, కుటుంబ సభ్యులు సుఖ సంతోషాలతో ఉండాలని, పశుపక్షాదులు ఎటువంటి రోగాల బారిన పడకుండా కాపాడాలని ప్రత్యేక పూజలు చేస్తూ మొక్కులు చెల్లిస్తుంటారు.



రాయికిబొట్లు పెట్టి పూజ చేసిన దృశ్యం

మెరకగూడెంలో వెయ్యేళ్ల నాటి వేప, మద్ది చెట్లకు పూజలు చేస్తున్న దృశ్యం

జాతరకు ఏర్పాట్లు

బుట్టాయగూడెం మండలం మెరకగూడెంలో ఈ ఏడాది ఇలవేల్పుల జాతరకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడ సుమారు 1000 సంవత్సరాలకు వయసు గల పెద్ద వేప, మద్ది చెట్టు ఉంది. దాని పక్కన నాగోబా పుట్ట ఉంది. ఇక్కడే ఏప్రిల్ నెలలో వచ్చే మాఘశుద్ధ పున్నమి రోజు నుంచి జాతర నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇక్కడ జాతర ప్రారంభించి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒరిస్సా, మధ్యప్రదేశ్, ఛత్తీష్‌గఢ్ రాష్ట్రాల్లో ఉన్న సోదెం వంశీయుల వద్దకు వెళ్లి వారి వద్ద ఉన్న గొంది దగ్గర పూజలు చేస్తారు. ఆయా రాష్ట్రాల్లో పూజలు అనంతరం మళ్లీ బుట్టాయగూడెం మండలం మెరకగూడెం చేరుకుని మూడు రోజుల పాటు జాతర చేస్తారు. ఈ జాతరకు తెల్లం, గాలి, కుర్సం, కోర్స, ఉయికే, మడకం, కలుము ఇంటి పేర్లు ఉన్న వంశస్తులు పాల్గొంటారు. వీరు పడిగ త్రిభుజ ఆకారంలో ఉండే ఎర్రని గుడ్డపై బొమ్మల లిపి పడిగను తీసుకు వచ్చి ఇలవేల్పుల జాతర ప్రాముఖ్యతను వివరిస్తారని గద్దె వడ్డెలు పూజారులు తెలిపారు. ఈ జాతరలో బోద్దుకూర, చావకోళ్లు, ఊరిపి బెల్లం, పసుపు, కుంకుమ, శనగపప్పు, దేవుడికి నైవేద్యంగా పెట్టి వడ్డెలు పూజారులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీరుస్తారు. అలాగే కొన్ని శక్తులను అతి పురాతనమైన గుహలో భద్రపరుస్తారు.



మెరకగూడెంలో ఉన్న నాగోబా పుట్ట



సోదెం వంశీయులు చరిత్రను తెలిపే బొమ్మల ఎర్రగుడ్డను చూపిస్తున్న దృశ్యం



వడ్డెర పూజారులు పేలు కర్రను మోస్తున్న దృశ్యం

ఆదివాసీల సంప్రదాయాలను కాపాడుకోవాలి



ఆదివాసీల జీవన విధానం సంస్కృతి, సంప్రదాయలు, చరిత్రలను కాపాడుకోవలసిన అవసరం ఉంది. ఆదివాసీల తెగలకు సంబంధించిన ఇలవేల్పులు, గ్రామ దేవతలు, గద్దెలకు ప్రత్యేక పూజలు చేస్తూ సాంప్రదాయలను కాపాడుకుంటేనే మన్య ప్రాంతంలో ప్రజలు పాడి పంటలతో ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉంటారు.

– సోదెం చిరంజీవి, -వడ్డెర పూజారి, అచ్చియ్యపాలెం

జాతర ఎంతో ప్రాముఖ్యమైనది



ఇలవేల్పుల జాతర ప్రాముఖ్యమైనది. కోయ తెగలో ఉన్న వంశానికి చెందిన వారిని గొంట్లు గా పిలుస్తారు. పెరంబోయిన వంశానికి చెందిన వారిలో పశ్చిమ మన్యంలో సోదెం, రవ్వ ఇంటి పేరుతో ఉన్నారు. వారి ఆధ్వర్యంలోనే ఉగాది తర్వాత వచ్చే మాఘ పున్నమి రోజున జాతరకు సన్నాహాలు చేస్తున్నాం.

– సోదెం సుధాకర్ తలపతి, కర్మాడ్, గద్దె వడ్డె, అచ్చియ్యపాలెం

డీఎల్‌పీఓ పరిశీలన



యర్రంపేటలో చెత్త సేకరణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ

కొయ్యలగూడెం: పొంగుటూరు, యర్రంపేట, కన్నాపురం గ్రామాల్లో ఆదివారం డీఎల్‌పీవో రజాఉల్లా పర్యటించారు. శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా రెండు రోజులపాటు నిర్వహించిన చెత్త సేకరణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఇంటింటికీ తిరుగుతూ చెత్త సేకరణపై ప్రజల్లో అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల పంచాయతీల కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

వైఎస్సార్ సీపీలో కె.కోట నేతలకు పదవులు

కామవరపుకోట: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు చింతలపూడి అసెంబ్లీ నియోజకవర్గ విభాగాల అధ్యక్షులుగా కామవరపుకోట మండలం నుంచి పలువురిని నియమించారు. చేనేత విభాగం అధ్యక్షురాలిగా తమ్మిశెట్టి గిరిజ నాగ సరస్వతి, సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడిగా బండెల ప్రభాకర్ ఆనంద్, లీగల్ విభాగం అధ్యక్షుడిగా తమ్మిశెట్టి నాగేంద్ర ఫణిదీప్, ప్రచార కమిటీ విభాగం అధ్యక్షుడిగా మేరుగు బాబురావు, కల్చరల్ విభాగం అధ్యక్షుడిగా చిలుకూరి సుబ్బారావు, మేధావులు ఫోరం విభాగం అధ్యక్షుడిగా రుద్రపాక నాగమల్లేశ్వరరావు, ఐటీ విభాగం అధ్యక్షుడిగా వెర్రు శ్రీను, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా చొక్కా నాగరాజు నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని చెప్పారు.



టి.గిరిజ నాగ సరస్వతి, చేనేత విభాగం నియోజకవర్గం అధ్యక్షురాలు



బండెల ప్రభాకర్ ఆనంద్, సోషల్ మీడియా విభాగం నియోజకవర్గం అధ్యక్షుడు



తమ్మిశెట్టి నాగేంద్ర ఫణిదీప్, లీగల్ సెల్ నియోజకవర్గం అధ్యక్షుడు



మేరుగు బాబురావు, ప్రచార కమిటీ నియోజకవర్గ అధ్యక్షుడు



చిలుకూరి సుబ్బారావు, కల్చరల్ వింగ్ నియోజకవర్గ అధ్యక్షుడు



రుద్రపాక నాగ మల్లేశ్వరావు, మేధావుల ఫోరమ్ నియోజకవర్గ అధ్యక్షుడు



వెర్రు శ్రీనుబాబు, ఐటీ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు



చొక్కా నాగరాజు, దివ్యాంగుల విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు

అసత్య ప్రచారాలను నమ్మొద్దు

వేలేరుపాడు: పోలవరం నిర్వాసితులు అసత్య ప్రచారాలను నమ్మి మోసపోవద్దని కేఆర్‌పురం ఐటీడీఏ పీఓ, భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్ అధికారి కె.రాములునాయక్ హితవు పలికారు. నిజమైన నిర్వాసితుడికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ విషయంలో పూర్తి న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. ఆదివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుక్కునూరు మండలంలోని చీరవల్లిలో ఇంటి విలువల(స్ట్రక్చర్ వాల్యూ)కు సంబంధించి తనపై వచ్చిన ఆరోపణలను పీఓ తీవ్రంగా ఖండించారు. తన దగ్గరకు సమస్య పరిష్కారం కోసం వచ్చిన బాధితులకు న్యాయం చేసే క్రమంలో ఫోన్ చేసి నిర్వాసితులు గొడవలు పడొద్దు... ఏదైనా ఉంటే కుటుంబీకులు సెటిల్ చేసుకోండని మాట్లాడితే దాన్ని వక్రీకరించి నిర్వాసితుల్లో గందరగోళ పరిస్థితి సృష్టిస్తూ, కొందరు బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడుతున్నారని అన్నారు. ఇలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

మహాశివరాత్రికి ఆలయాలు ముస్తాబు

రేపటినుండి ప్రారంభం కానున్న ఉత్సవాలు

కొయ్యలగూడెం: మహాశివరాత్రి ఉత్సవాలకు ముక్కంటి ఆలయాలు ముస్తాబయ్యాయి. ఈనెల 26వ తేదీ మహాశివరాత్రి నేపథ్యంలో కన్నాపురంలోని శ్రీ దుర్గాభవాని రసలింగేశ్వర స్వామి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. మంగళవారం మామిడి తోరణం, విఘ్నేశ్వర పూజ అభిషేకాలతో పూజలు ప్రారంభించి, అదేరోజు శ్రీ దుర్గాభవాని అన్నపూర్ణ సమేత రసలింగేశ్వర స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు సీహెచ్ మణికంఠ శర్మ పేర్కొన్నారు. 26వ తేదీ అర్ధరాత్రి లింగోద్భవ పూజలు నిర్వహిస్తున్నామన్నారు. 29వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగుతాయన్నారు. అదేవిధంగా అంకాలగూడెంలోని శ్రీ ఉమా సమేత భోగలింగేశ్వర స్వామి, పులివాగు శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి, యర్రంపేట ఉమా సమేత రామలింగేశ్వర స్వామి, కొయ్యలగూడెం శ్రీ మీనాక్షి సమేత సుందరేశ్వర స్వామి ఆలయాలలో శివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నామని పాలకవర్గ సభ్యులు పేర్కొన్నారు.



కన్నాపురంలోని శ్రీ దుర్గా భవాని రసలింగేశ్వర స్వామి ఆలయం

సారారహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం



బుట్టాయగూడెం: ముద్దప్పగూడెంలో సారా నిర్మూలనపై అవగాహన



చింతలపూడి: సుప్రింపేటలో అవగాహన కలిగిస్తున్న ఎక్సైజ్ అధికారులు

బుట్టాయగూడెం: సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే నవోదయం ముఖ్య ఉద్దేశమని పోలవరం ఎక్సైజ్ సీఐ కె.వీరబ్రహ్మం తెలిపారు. మండలంలోని ముద్దప్పగూడెంలో ఆదివారం నవోదయం 2.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాటుసారా తయారీ నిర్మూలనపై ప్రజలకు అవగాహన కలిగించారు. సీఐ వీరబ్రహ్మం మాట్లాడుతూ నాటుసారా పూర్తిగా నిర్మూలించడం కోసం యువత తమకు సహకరించాలని కోరారు. నాటుసారా తాగడం వల్ల అనేక కుటుంబాలు వీధిన పడ్డాయన్నారు. నాటుసారా జోలికి పోవద్దని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ కుంజా దుర్గమ్మ, ఎస్సై సునీల్‌కుమార్, ఏలూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఫణి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సారా నిర్మూలనపై అవగాహన

చింతలపూడి: సుప్రీంపేటలో నాటు సారా, గంజాయి, బెల్ట్ షాపుల నిర్మూలనపై ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ పి అశోక్ సారా వల్ల కలిగే అనర్థాలపైగ్రామస్తులకు వివరించారు. సారా తయారు చేసినా, విక్రయించినా, బెల్ట్ షాపులు నిర్వహించినా కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. ఎస్సై ఆర్‌వీఎల్ నరసింహారావు, హెడ్ కానిస్టేబుల్ దుర్గా శంకర్, కానిస్టేబుల్ రమేష్ పాల్గొన్నారు.

● గుండె జారుతోంది



ఆశన్నగూడెంలో శిథిలావస్థకు చేరిన గుండేరు వంతెన

లింగపాలెం మండలం ఆశన్నగూడెం శివారులో ఉన్న గుండేరుపై వంతెన కూలిపోవటానికి సిద్ధంగా ఉంది. వంతెన శిథిలావస్థకు చేరి ఏళ్లు గడుస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ వంతెనపై నుంచి నిత్యం లింగపాలెం, కామవరపుకోట మండలాలకు చెందిన ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. వర్షాకాలంలో ఈవంతెన మీద ప్రయాణించాలంటే హడలిపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నిధులు మంజూరు చేసి వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

– లింగపాలెం

కోతుల బెడద

చింతలపూడి: నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో కోతుల బెడద ఎక్కువగా ఉంది. అడవులు అంతరించి పోతుండటంతో కోతులు గ్రామాలపై పడుతున్నాయి. ఇళ్లపైకి ఎక్కి పైకప్పులను ధ్వంసం చేయడం, పొలాలపై పడి పంటలను నాశనం చేస్తున్నాయి. దీంతో వేల రూపాయలు నష్టపోవాల్సి వస్తోందని గ్రామస్తులు, రైతులు వాపోతున్నారు. మెట్ట ప్రాంతంలో మొక్కజొన్న, వేరు శనగ, కొబ్బరి, అరటి, జామ, మామిడి , కూరగాయల పంటలు పండిస్తున్నారు. కోతులు గుంపులు, గుంపులుగా వచ్చి చేరి వాటిని నాశనం చేస్తున్నాయని చెబుతున్నారు. ఉదయం 6 నుంచి పంట పొలాల్లో , సాయంత్రం 6 దాటాక చెట్లపైకి చేరి సేద తీరుతున్నాయని చెప్పారు. ముఖ్యంగా చింతలపూడి, ప్రగడవరం, యర్రగుంటపల్లి, రేచర్ల, సీతానగరం, చింతంపల్లి, రాఘవాపురం జంగారెడ్డిగూడెం మండలం, కామవరపుకోట ప్రధాన రహదారుల్లో రోడ్ల పక్కన ఉన్న భారీ వృక్షాలపై నివాసం ఉంటున్నాయి. కోతుల బెడదతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. పంటలతో పాటు ఇళ్లల్లోకి చొరబడి వస్తువులను ఎత్తుకెళ్లి ధ్వంసం చేస్తున్నాయని వాపోతున్నారు. తోలడానికి వెళితే ఎదురు తిరిగి గాయాలపాలు చేస్తున్నాయని అంటున్నారు. కోతుల బెడద ఎక్కువైనా అటవీ అధికారులు పట్టించుకోవడం లేదని ఇప్పటికైనా స్పందించి కోతుల నివారణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



రోడ్ల పై గుంపులుగా చేరిన కోతులు



చింతలపూడిలో ఒక ఇంటి పైకి చేరిన కోతులు

విద్యార్థులకు పరీక్ష కిట్‌ల అందజేత

జంగారెడ్డిగూడెం: హెల్పింగ్ హాండ్స్ వెల్ఫేర్ సొసైటీ, శ్రీ బొల్లిన గంగరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యర్నగూడెం ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం జిల్లా పరిషత్ హైస్కూల్ పదవ తరగతి విద్యార్థులకు సుమారు 264 పరీక్ష కిట్‌లు, ఎగ్జామ్ ప్యాడ్స్, పెన్నులు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం లోవకుమారి మాట్లాడుతూ హెల్పింగ్ హాండ్స్ వెల్ఫేర్ సొసైటీని ఆమె అభినందించారు. కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు కావలిపురపు బాలకృష్ణ, సెక్రటరీ తిరుపతి ప్రసాద్, సభ్యులు గ్రేసీ, తనుజ, జయరాణీ, మాథ్స్ ఉపాధ్యాయులు నబి, మిగిలిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పరీక్ష కిట్‌లను అందజేస్తున్న దృశ్యం

మానవత సభ్యుడి సహాయం

జంగారెడ్డిగూడెం: వృద్ధ దంపతులకు మానవత ఆడిట్ కమిటీ చైర్మన్ దల్లి కేదారేశ్వరరెడ్డి ఆర్థిక సహాయాన్ని అందించారు. అనారోగ్యంతో బాధపడుతున్న మార్కండేయపురానికి చెందిన అంకనబోయిన నార్య, సుబ్బమ్మ దంపతులకు ఆర్థిక సహాయంతోపాటు పరుపులు, దుప్పట్లు తదితరాలు మొత్తం రూ.6వేలు విలువైన వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో మానవత సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి రైతుకూ విశిష్ట సంఖ్య నమోదు

జంగారెడ్డిగూడెం: ప్రతి రైతు విశిష్ట సంఖ్యను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని ఏలూరు జిల్లా వ్యవసాయ అధికారి షేక్ హబీబ్ బాషా అన్నారు. జంగారెడ్డిగూడెం మండలంలో సహాయ వ్యవసాయ సంచాలకుల కార్యాలయం నందు జరిగిన ప్రతి రైతు విశిష్ట సంఖ్య నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సొంత భూమి కలిగిన ప్రతి రైతు 11 అంకెలగల విశిష్ట సంఖ్యను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. కోట రామచంద్రపురం సహాయ వ్యవసాయ సంచాలకులు పీజీ బుజ్జిబాబు మాట్లాడుతూ ఇప్పటివరకు జంగారెడ్డిగూడెం మండలంలో 7600 మంది రైతులు నమోదు చేసుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కేవీఎస్ పోసిరావు, జంగారెడ్డిగూడెం మండల వ్యవసాయ, ఉద్యానవన సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

● నిద్రగన్నేరు.. గబ్బిలాలు సేదతీరు



ఆశన్నగూడెంలో శిథిలావస్థకు చేరిన గుండేరు వంతెన

సాధారణంగా గబ్బిలాలు పాడుబడిన భవంతులలో, గుహలలోను ఉంటుండడం సహజం. అయితే కొయ్యలగూడెం – అచ్యుతాపురం గ్రామాల మధ్య జాతీయ ప్రధాన రహదారికి ఆనుకుని, చెరువుగట్టుపై ఉన్న నిద్రగన్నేరు చెట్టుకు గబ్బిలాలు వేలాడుతూ ఉంటాయి. సుమారు 50 ఏళ్ల నుంచి ఇలానే చెట్టుకు గబ్బిలాలు వేలాడుతూ ఉంటాయని స్థానిక రైతులు పేర్కొన్నారు. రాత్రి వేళల్లో ఆహార సముపార్జనకు వెళ్లి అనంతరం చెట్టు కొమ్మలను పట్టుకుని తల్లకిందులుగా వేలాడుతూ సేద తీరుతుంటాయని తెలిపారు.

– కొయ్యలగూడెం